# అంతర్ధానం

సలీం

# కథా క్రమం ...


| | | |
|---|---|---|
| నిర్ణయం | .... | 5 |
| తోడు | .... | 16 |
| అమ్మలగన్న అమ్మ | .... | 28 |
| నీటి బుడగలు | .... | 39 |
| అడుసు తొక్కనేల... | .... | 53 |
| చీకటి చివర్న వెల్తురు | .... | 63 |
| క్రిష్ణబిలం | .... | 75 |
| పెట్టుబడి | .... | 87 |
| సీతమ్మ చెరువు | .... | 97 |
| ఫంగస్ | .... | 108 |
| చిట్టచివరి ఆలోచన | .... | 118 |
| ఆకుపచ్చని కన్నీరు | .... | 130 |
| మొదటి అడుగు | .... | 145 |
| కొత్త నీరు | .... | 157 |
| సమిథ | .... | 166 |
| ఆవర్తనం | .... | 177 |
| సద్గతి | .... | 186 |
| ఆలియా బేగం | .... | 197 |
| ముసుగు | .... | 207 |
| అంతర్గానం | .... | 223 |

# నిర్ణయం

అర్ధరాత్రి దాటినా కంటిమీదికి కునుకు రావటం లేదు. చుట్టూ చీకటి... దట్టమైన చీకటి.. నా జీవితంలోకి వొలికిపోయిన చీకటి.. రాజేష్.. నా భర్త.. ఇష్టపడి ప్రేమించి పెళ్ళాడి.. ఎన్ని మధురమైన రాత్రులో.. నా ఒంటిమీదకి పాకుతున్న వెచ్చని శ్వాస.. అప్రయత్నంగా చేతులు చాపి తడిమి చూసుకున్నాను. భ్రమ.. ఏడాది కాలంగా నన్ను ఏడిపిస్తున్న భ్రమ. .ఒకనాటి తీయటి జ్ఞాపకాలన్నీ పదునైన కత్తులుగా మారి గాయం చేస్తూ... సుకేశిని...పుట్టినపుడు నల్లటి వత్తైన జుట్టుతో పుట్టిందని నేను ముద్దుగా పెట్టుకున్న పేరు...దానికెపుడూ వాళ్ళ నాన్నంటేనే ఇష్టం..అందుకే నన్ను ఒంటరిగా వదిలేసి వాళ్ళ నాన్నతో కలిసి ఏవో లోకాలకి వెళ్ళిపోయింది.

ఆ దుర్ఘటన జరిగి ఏడాది దాటినా క్షణం ముందే నా కళ్ళెదురుగా జరిగినట్లు... భయం నరనరాన పాకుతూ... దుఃఖం రక్తంలోకి ఇంకిపోతూ... కళ్ళు మూసి తెరిచే లోపల...ధడాల్న శబ్దం.. స్కూటర్ నడుపుతున్న రాజేష్తో నేనేదో మాట్లాడుతున్నా. వాళ్ళ నాన్న నడుముని కౌగిలించుకుని కూచున్న సుకేశిని ఎందుకో నవ్వుతోంది. ఎదురుగా దురుసుగా వచ్చిన క్వాలిస్.. ధడాల్న శబ్దం. నేను ఎగిరి రోడ్డుకవతల పడిపోయా. హాస్పిటల్లో రెండ్రోజులు ఐసియూలో ఉన్నాక కళ్ళు తెరిచాను. అన్నీ కన్పిస్తున్నాయి, అందరూ కన్పిస్తున్నారు. కానీ రాజేష్, సుకేశిని మాయమైపోయారు.. జీవితంలోని వెల్తురునంతా ఎవరో మింగేసినట్లు... అంతా అంధకారం...

సుకేశిని.. ఎంత ముద్దుగా ఉండేదో... చారడేసి కళ్ళు... నా కళ్ళే... సోగకళ్ళు.... పెదవులూ చుబుకం వాళ్ళ నాన్న పోలిక... ముఖ్యంగా బుగ్గల మీద పడే సొట్ట... రాజేష్ నోట్లోంచి వూడి పడ్డట్లు...

దాన్ని కనడానికి ఎన్ని కష్టాలు పడ్డానో... పెళ్ళయి మూడేళ్ళయినా పిల్లలు కలక్కపోతే డాక్టర్లను సంప్రదించాం. రకరకాల పరీక్షల తర్వాత నాలోనే లోపముందని తెలిసింది. అండాన్ని మోసుకెళ్ళే ఫ్యాలోపియన్ ట్యూబుల్లో లోపమట.. ఎలా ఏడ్చానో.. రాజేష్కి పిల్లలంటే ఎంతిష్టమో నాకు తెలుసు... పిల్లలకోసం నన్ను వదిలేసి మరో

అమ్మాయిని చేసుకుంటాడేమోనన్న భయం... రాజేష్ పెద్దగా నవ్వాడు. పిల్లలు లేకున్నా పర్లేదు, నువ్వు తప్ప నా జీవితంలో మరో స్త్రీ ఉండదు, ప్రామిస్ అన్నాడు..

ఇద్దరం కరుణ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయించాం. డాక్టర్ కరుణ... పేరుకి తగ్గట్టే కరుణామయి.. వరాలు కురిపించే దేవతలా కన్పించింది నా కళ్ళకి.. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ గురించి వివరించడం, అందుకు మేము సమ్మతి తెలపటం వెంటవెంటనే జరిగిపోయాయి. పిల్లలున్నవాళ్ళకి వాళ్ళవిలువ తెలీదు కానీ పిల్లలు కలగని వాళ్ళు పడే మానసిక శారీరిక హింస చూస్తే అర్థమవుతుంది పిల్లలు పుట్టడం ఎంత అదృష్టమో...

ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ ప్రక్రియలో ఎన్ని మందులో.. ఎంబ్రియో గర్భ కుహరంలో కుదురుగా కూచునే వరకు ఎంత వత్తిడో... ఎక్కువ అండాలు విడుదల కావడంకోసం గొనాడోట్రోపిన్ ఇంజక్షన్లు వరసగా పది రోజులిచ్చారు. దానివల్ల కొన్నిసార్లు ఓవేరియన్ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ అనే జబ్బొచ్చి చచ్చిపోయే ప్రమాదముందని తెలిసి నేనూ రాజేష్ భయంతో ప్రాణాల్ని ఉగ్గబట్టుకుని ఎదురుచూశాం... అదృష్టవశాత్తూ అలాంటిదేమీ జరగలేదు..

పన్నెండు అండాలు.. విడుదలైన ముప్పయారు గంటల్లో తీయాలట.. ఎంత నొప్పిని భరించానో వాటిని తీసే సమయంలో.. రాజేష్ శుక్రకణాల్ని నేరుగా అండాల్లోకి ఇంజక్షన్ ద్వారా పంపించి గాజు నాళికలో ఫలదీకరణ చేయించారు. పన్నెండు ఎంబ్రియోలు. అందులో రెండు పనికి రాకుండా పోయాయట. మిగిలిన పదిలో ఐదింటిని గర్భంలోకి ప్రవేశ పెట్టారు. అన్నీ నిలబడవట. ఒకటో రెండో స్థిరపడ్తాయట. ఒక్కోసారి అన్నీ ఫెయిలవుతాయట. అప్పుడు మిగిలిన ఎంబ్రియోలని ప్రవేశపెడ్తారట.

నాకు రెండోసారి ఎంబ్రియోలని వాడాల్సిన అవసరం లేకుండానే గర్భం నిలబడింది. తొమ్మిది నెలల తొమ్మిది రోజులకి సుకేశిని పుట్టింది... మామూలు డెలివరీ కాదు.. సిజేరియన్ ద్వారా... పండంటి కూతురు పుట్టిందన్న సంతోషంలో ప్రపంచం నా పాదాల చెంత వాలినంత సంబరపడ్డాను. కానీ ఏం లాభం? దానికైదేళ్ళు వచ్చేవరకే అచ్చటా ముచ్చటా చూడగలిగాను.

# నీటి బుడగలు

నాకు చాలా బాధగా ఉంది. కోపంగానూ ఉంది. స్వంత అన్నకూడా ఇలా మాయమాటల్తో మభ్య పెట్టి నన్ను మోసం చేస్తాడని వూహించలేదు. ఈ ప్రేమలూ మమకారాలూ అనుబంధాలూ ఆప్యాయతలూ అన్నీ భ్రమేనా? చిన్నప్పుడు ఎంత ప్రేమగా చూసేవాడో.. అన్న కంటే పదేళ్ళు చిన్నదాన్ని నేను. అన్న నన్ను ఎత్తుకుని ఆడించేవాడు. దగ్గర కూచోబెట్టుకుని చదువు చెప్పేవాడు. అలిగితే బతిమాలి అన్నం తినిపించేవాడు. వయసు మీరిపోతుందని బలవంతం చేసినా నా పెళ్ళయ్యేవరకు తను పెళ్ళి చేసుకోనని భీష్మించుకుని కూచున్నవాడు. ఇపుడెందుకిలా మారిపోయాడో ఎందుకిలా కఠినంగా మాట్లాడుతున్నాడో అర్థం కాక, పైట చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ కూచున్నాను.

"యింకెందుకిక్కడ? వెళ్దాం పద" అన్నాడు రమేష్.. నా భర్త.

"కొద్దిసేపుండండి. ఈ విషయం ఏదో తేలనివ్వండి" అంటూ అన్న వైపు చూశాను. మనసులో ఏమేం భావాలు సుళ్ళు తిరుగుతున్నాయో తెలీదు కానీ మొహం మాత్రం అభావంగా పెట్టి చూపు మరో వైపుకు మరల్చి కూచున్నాడు. అతని పక్కనే వదిన ఉంది. ఆమె కోపంతో రగిలిపోతున్నట్టు స్పష్టంగా మొహంలో కన్పిస్తోంది. ముక్కుపుటాల్లోంచి శ్వాస పాము బుసలా వస్తోంది. కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా ఉన్నాయి. ఆమె నా చూపుని తప్పించుకోడానికి విసురుగా తల విదిలించినప్పుడు చెవుల్లోని వజ్రపుకమ్మల మీద ట్యూబ్‌లైట్ కాంతి పడి అవి తళుక్కున మెరిశాయి.

"అన్నా.. చివరిగా అడుగుతున్నా. అమ్మ వజ్రాల కమ్మలు నాకు చెందాలి. అమ్మ చివరి కోరిక కూడా అదే. చనిపోయేముందు కూడా మాట పడిపోయినా సైగల్తో ఆ కమ్మలు నాకే ఇస్తానని చెప్పినపుడు నువ్వూ వదినా పక్కనే ఉన్నారుగా. కమ్మలు ఇచ్చేయమని వదినతో చెప్పు" అన్నాను.

అన్న ఏదో చెప్పబోయేలోపల వదిన కస్సున లేచింది. "అత్తయ్య సైగల్తో చెప్పిన విషయాన్ని నీకనుగుణంగా వక్రీకరిస్తే అవును కామోసు అని తల వూపడానికి

ఇక్కడెవరూ వాజమ్మలు లేరు. ఆ సైగల అర్థం కమ్మలు తన కోడలికే చెందుతాయని. అత్తయ్య తన చెవులను ముట్టుకుని తర్వాత నా వైపు చూపించడం నువ్వు చూళ్ళేదా?"

"నీ దగ్గరున్న కమ్మల్ని నాకిమ్మని కదా సైగల్తో చెప్పింది"

"కాదు. ఆ కమ్మలు నా దగ్గరే ఉండాలని తన కోరిక అని నీకు చెప్పటం కోసం నీ వైపు చూసింది. ఏది ఏమైనా ఎవ్వరేమనుకున్నా ఈ కమ్మలు వేరేవాళ్ళకిచ్చే ప్రసక్తే లేదు" అంది వదిన.

"అన్నా.. నువ్వేమీ మాట్లాడవేంటి? వేరేవాళ్ళంటుందేమిటి వదిన? నేను పరాయిదాన్నా? మా అమ్మ నగల మీద కూతురిగా నాకు హక్కుండదా? నేనేమీ మిగతా బంగారం గురించి మాట్లాడటం లేదే. వజ్రాల కమ్మలు నా చిన్నప్పటి నుంచి అమ్మ నాకిస్తాననడం నీకూ గుర్తుండే ఉంటుంది" అన్నాను.

"అత్తగారి నగలమీద కోడలిగా నాకు హక్కుండదా? పెళ్ళయి ఈ ఇంటికొచ్చాక మీ అమ్మకు సపర్యలు చేసింది నేను. పూటకింత తిండి పెట్టింది నేను. రోగమొచ్చి మంచం పడితే వూడిగం చేసింది నేను. నాకు లేని అధికారం నీకెక్కడినుంచి వస్తుంది? కావాలంటే కోర్టుకెళ్ళు. అక్కడ చూసుకుందాం" అంది వదిన.

"కోర్టుకెళ్ళే తాహతే ఉంటే ఇలా మీ ముందు నిలబడి దేబిరించాల్సిన అవసరమే రాదు కదా వదినా? నా భర్త చిన్న ఉద్యోగస్థుడు. మాకిద్దరు ఆడపిల్లలున్నారు. నీకు ఒక్కడే మగపిల్లాడు. ఆలోచించు వదినా. నా కూతుర్లకి ఒక్కో కమ్మ ఇచ్చుకుంటాను" అన్నాను.

"ఏం? నా కోడలికి నేనిచ్చుకోలేనా? మా అత్తయ్య నాకిచ్చేనట్టే నేను నాకోడలికిస్తాను" అంది వదిన.

వదిన ఎలాంటిదో నాకు తెలుసు కాబట్టి ఆమెతో మాట్లాడటం వల్ల ప్రయోజనం ఉండదని అర్థమై అన్న వైపు తిరిగి "నువ్వేమీ మాట్లాడవేంటి అన్నా" అన్నాను.

"మీ అన్న చెప్పినా సరే నేను ఇవ్వను. అర్థమైందా? యిక నువ్వు వెళ్ళొచ్చు" అనేసి వదిన లోపలికెళ్ళిపోయింది.

# చీకటి చివర్న వెల్తురు

బస్ దిగి యింటి వైపుకి నడుస్తున్నాను... భయం భయంగా.

ఎవరేం కామెంట్ చేస్తారోనన్న భయం... అది పదునుగా మనసుని గాయం చేస్తుందేమోనన్న భీతి... ఎదురుగా వచ్చేవాళ్ళకు వీలైనంతగా నా మొహం కన్పించకుండా తల వొంచుకుని నడుస్తున్నాను. బస్‌లో గుచ్చుకున్న చూపులు యింకా సలుపుతున్నాయి... వాళ్ళ కళ్ళల్లో కన్పించిన ఆశ్చర్యం, అవహేళన... వాళ్ళ కనుగుడ్లు పీకేయాలన్నంత కోపాన్ని దిగమింగుకుని... ఎన్నేళ్ళనుంచిఈ బాధల్ని మోస్తున్నానో... పుట్టినప్పటి నుంచీ...

ఎదురుగా యిద్దరు కుర్రవాళ్ళు వస్తున్నారు. మా యింటికి దగ్గరే వాళ్లిల్లు కూడా.

మరింత బిగుసుకుపోయి తలని భూమిలోకి పాతేసి నడుస్తున్నాను. నా సిక్త్ సెన్స్ చెప్తోంది వాళ్ళు తప్పకుండా ఏదో అంటారని... నా వొళ్ళంతా చెవులు మొలిచాయి. వాళ్ళని దాటి కొద్దిగా ముందుకు నడిచాను. హమ్మయ్య ఏమీ జరగలేదు అనుకుంటున్నంతలో బాంబులా శబ్దం పేలింది.

“నాకు చీకటంటె బయ్యం” ఏదో సినిమాలో పాట ఒకతను ఎత్తుకున్నాడు.

“అమ్మో... నాకు మరీ బయ్యం” రెండోవాడు వంత పాడాడు.

వాళ్ళ చొక్కాలు పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా కసితీరా వాయించాలన్నంత కోపం... ‘సినిమాలో పాట పాడుకుంటే నీకేంటి మధ్యలో... నువ్వెందుకు భుజాలు తడుముకుంటావు’ అని ప్రశ్నిస్తే నా దగ్గర సమాధానం లేదు. నా అసహాయత మరింత వెక్కిరిస్తూ... తన్నుకు వస్తున్న ఏడుపుని బలవంతంగా ఆపుకున్నాను.

యింట్లోకి వెళ్ళబోతున్నపుడు వెనకనుంచి మాటలు వినపడ్డాయి. “రేపు అమావాస్య... మంచిది కాదు” అంటున్నారెవరో. చప్పున వెనక్కి తిరిగి చూశాను. అతను నావైపు పళ్ళికిలిస్తూ చూశాడు. బగ్స్ బన్నీలా ఎత్తు పళ్ళేసుకుని... నన్నంటాడా... నేనూ తిరిగంటే మొహం ఎక్కడ పెట్టు కుంటాడు? మా నాన్నకున్నంత వయసు...

మా యింటికి రెండిళ్ళవతల ఉండే సుధాకర్ అంకుల్. అతని పక్కన యింకొకతను నిలబడి నా వైపు నోరెళ్ళబట్టి చూస్తున్నాడు.

వూహ తెల్సిన క్షణం నుంచీ నా అసలు పేరుతో కాకుండా నన్నందరూ చీకటనో అమావాస్య అనో పిలిచి గేలి చేసినవాళ్లే... కుర్రాళ్ళు ఏడ్పిస్తున్నారనుకుంటే ... ముసలోడు వీడికేం పోయేకాలం వచ్చిందో...

విసురుగా వెళ్ళి అతని ముందు నిలబడ్డాను. బాధ, కోపం, కసి అన్నీ కలగలిసిపోయి బుసలు కొడ్తున్నట్లే శబ్దం బైటికొస్తూ "ఏమన్నావంకుల్... మళ్ళా అను" అన్నాను.

నవ్వు మాయమై అయోమయంగా చూస్తూ "నేనేమన్లేదే" అన్నాడు.

"అమావాస్య అన్నావు. నేను విన్నాను. ఇంత వయసొచ్చి అబద్ధాలెందుకు చెప్తావు? నన్ను చూసే కదా అన్నావు" కోపంతో పెద్దపెద్దగా అరిచాను.

అతని పక్కనున్నతను "రేపు అమావాస్య అని అన్నది నేనమ్మా. అందులో తప్పేం ఉంది? రేపు అమావాస్యేగా" అన్నాడు.

"మళ్ళా అదే మాట... చూస్తే పెద్దవారిలా ఉన్నారు. నాకు తెలీదనుకోకండి. నేను నల్లగా ఉన్నాననేగా అలా అన్నారు. మీకు నాలాంటి కూతురుంటే అలానే అంటారా? చదువూ సంస్కారం లేని వాడిలా ప్రవర్తించడానికి మీకు సిగ్గనిపించడం లేదా"

నా మాటలకు సుధాకర్ అంకుల్ మొహంలో కోపం కన్పించింది కాని అతని పక్కనున్న వ్యక్తిలో మాత్రం నేనూహించని ప్రశాంతత.. అతను చిర్నవ్వుతో నా వైపు చూశాడు. "సుధాకర్ గారింట్లో ఓ శుభకార్యం జరగాల్సింది ఉందమ్మా. నేను పంచాంగం చూసి ముహూర్తాలు చెప్తాను కాబట్టి రేపు మంచి రోజా అని అడిగారు. అమావాస్య ఉందనీ, మంచిది కాదనీ చెప్తుండగా నువ్వు కోపంతో రగిలిపోతూ వచ్చావు. చూడు తల్లీ. నేనసలు నీవైపు కూడా చూళ్లేదు. అథవా చూసినా నువ్వు నల్లగా ఉన్నావని ఎగతాళెందుకు చేస్తాను తల్లీ... నేను పూజించే కృష్ణుడు నల్లనయ్యేకదమ్మా"

# పెట్టుబడి

అప్పటికి గంటనుండీ రమణమూర్తి ఎండలో నిలబడి ఉన్నాడు. మే నెల కావటం వల్ల సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. సమయం మధ్యాహ్నం పన్నెండున్నర... దాహం వేస్తోంది. ఆకలీ వేస్తోంది. ఏ క్షణమైనా డైరెక్టర్ నుంచి పిలుపు రావొచ్చు. తనది రైతు పాత్ర. పంటచేలోంచి వస్తున్న హీరో హీరోయిన్లని చూసి హీరోయిన్తో 'నువ్వు మా సుబ్బారాయుడి కూతురివి కదూ' అనాలి. తర్వాత హీరో వైపు చూపిస్తూ 'ఈ కుర్రాడెవరూ... మనూర్లో ఎప్పుడూ సూళ్ళేదే' అనాలి. అంతే. వెయ్యి రూపాయ లిస్తారు. షామియానా కింద భోజనాలు పెడ్తున్నారు. కడుపునిండా భోంచేసి ఎన్ని రోజులైందో...

హీరో హీరోయిన్‌కి కుర్రాళ్ళు గొడుగులు పడ్తున్నారు. పదినిముషాలకోసారి కొబ్బరి బొండాలూ కూల్ డ్రింకులూ అందిస్తున్నారు. ఓ డైలాగ్ చెప్పడానికి హీరో అప్పటికే పాతిక టేకులు తీసుకున్నాడు. ఔట్‌డోర్ షూటింగ్ కావటం వల్లా ఎండ వేడి విపరీతంగా ఉండటం వల్లా హీరో టేక్‌కి టేక్‌కి మధ్య ఛత్రఛాయలో సేద తీరుతున్నాడు. కొంతమంది విసనకర్రల్తో విసురుతున్నారు.

రమణమూర్తికి నిస్సత్తువగా అన్పించింది. కళ్ళు తిరిగి పడిపోతే ఆ వెయ్యి రూపాయలు కూడా దక్కవన్న భయమేసి పళ్ళ బిగువున నిలబడ్డాడు. చెమటలు కారిపోతున్నాయి. రైతు వేషం కాబట్టి నీరు కాయపట్టిన పంచె బిగించి కట్టారు. తలకు చుట్టిన తువ్వాలు తప్ప నడుం పైనంతా అనాచ్ఛాదింతగా ఉండటం వల్ల వర్షంలో తడిసినట్టు వళ్ళంతా చెమటతో తడిచిపోయింది. ఇప్పుడు జరుగుతున్న సీన్ షూట్ చేయడం ఐపోతే చాలు.. ఆ తర్వాత తను నటించాల్సిన సీన్ వస్తుంది. రెండు డైలాగులు చెప్పేస్తేచాలు.. 'కడుపులో పేగులు నకనకలాడ్తున్నాయి బాబూ.. యింటికెళ్ళి కూసింత సల్లటి గంజి తాగితే గానీ మంట సల్లారేలా లేదు'... అదే కదా డైలాగు? ఆకలి వల్ల మతిపోయిందో ఏమిటో... ఆ డైలాగు ఇరవై యేళ్ళ క్రితం తను నటించిన రైతు రాజ్యం సినిమాలోది కదా. అందులో తనది చాలా ముఖ్యమైన పాత్ర... ఎన్ని డైలాగులో... పేజీలు పేజీల డైలాగులు...

తన సినీ జీవిత ప్రస్థానంలో ఎన్ని అనుభవాలో? ఎన్ని రకాల వేషాలనీ.. చారిత్రక, జానపద, పౌరాణిక, సాంఘిక... అబ్బో... లెక్కలేనన్ని... తను మొహానికి రంగురాసుకున్న మొదటి రోజు తనకింకాగుర్తుంది. అప్పుడు తనకి నిండా పందొమ్మిదేళ్ళు లేవు. కాలేజీలో చదువుతున్న హీరో స్నేహితుల్లో ఒకడిగా నటించాలి. పది నిముషాల సీన్. 'కొత్త కుర్రాడివైనా బాగా చేశావు.. శభాష్' అన్నాడు డైరెక్టర్. మూడేళ్ళ నాటకానుభవం వూరికే పోతుందా మరి.. ఆ పొగడ్త ఎంత తీయగా ఉండిందో... కళాకారుడికి కడుపు నిండేది పొగడ్తలూ చప్పట్ల వల్లేగా.. ఇపుడే వింటున్నట్లు... చెవుల్లో తేనెధారలా మధురంగా.. తనకిపుడు అరవై యేళ్ళు... నలభై యేళ్ళ క్రితం జరిగిన సంఘటనైనా నిత్యనూతనంగా..

హీరో మళ్ళా డైలాగ్ తప్పు చెప్పినట్టున్నాడు. డైరెక్టర్ అసిస్టెంట్ డైరెక్టర్ మీద చిందులేస్తున్నాడు. "ఎవరయ్యా అంతంత క్లిష్టమైన పదాల్తో డైలాగులు రాసింది? ఆ రైటర్ని పిలవండి. డైలాగులు మార్చి రాయమనండి. ఇదేమీ పౌరాణిక సినిమా కాదు గ్రాంధిక భాష వాడటానికి.." అంటూ డైరెక్టర్ రమణమూర్తి వైపు కళ్ళు తిప్పి చూశాడు. "కొద్దిసేపు ఉండండి. ఐపోవచ్చింది. మిమ్మల్ని పిలుస్తాను" అన్నాడు.

రమణమూర్తి 'పర్లేదు' అన్నట్లు సైగచేశాడు. ఎంతలో ఎంత మార్పు? ఓడలు బండ్లు బండ్లు ఓడలు కావటం అంటే యిదే. డైరెక్టర్ సుధాకర్... నాలుగు సినిమాలకు డైరెక్షన్ చేశాడు. ఇపుడు చేతిలో రెండు సినిమాలున్నాయి. తను సినిమాల్లో క్యారెక్టర్ యాక్టర్‌గా రోజుకు రెండు మూడు షిఫ్టులు పన్చేస్తున్న రోజుల్లో లైట్‌బాయ్‌గా పన్చేసేవాడు. చాలా ఒద్దికగా, నోట్లో నాలుకలా మెసలేవాడు. అతని వినయం చూసి ముచ్చటపడి తనే ఓ సినిమాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం యిప్పించాడు. తనిప్పుడు అతని ముందు నిలబడి ఓ చిన్న వేషం కోసం పడిగాపులు కాస్తున్నాడు.

తన ఈ స్థితికి పరాయివాళ్ళెవరూ కారణం కాదు... తనే... అనంత కరుణ... అన్నార్తుల మీద దయ... అభాగ్యులంటే జాలి.. అడిగిన వాళ్ళకి కాదనకుండా సాయం చేశాడు. చేతికి ఎముకలేని మహానుభావుడని ఇండస్ట్రీ అంతా పొగిడింది. అపర దానకర్ణుడని ప్రజలందరూ కొనియాడారు. లక్షలు సంపాదించాడు. లక్షలు దానం చేశాడు. సినిమాల్లో అవకాశాలు తగ్గాయి. అప్పులు పెరిగాయి. వాటిని తీర్చడం

# ఆకు పచ్చని కన్నీరు

రాత్రి ఎనిమిదింటికి వాళ్ళమ్మ చేసిన వేడివేడి పరోటాలు, బంగాళాదుంప ఖుర్మా తెచ్చిపెట్టింది ఖాతూన్. సుష్టుగా భోంచేశాడు. తొమ్మిదింటికి గ్లాసునిండా గోరువెచ్చటి పాలు తెచ్చిచ్చింది. తాగాడు.

పదింటికి అతని పక్కకొచ్చి పడుకుంది. తెల్లటి నాజూకైన ఆమె శరీరం చిదుగులమంటలా వెచ్చగా ఉంది. అసలే చలికాలం.. దుప్పటిలా ఆమెని కప్పుకుని తన రక్తాన్ని వెచ్చబరిచే ప్రయత్నంలో మునిగిపోయాడు సాజిద్.

"మాటామంతీ ఏం ఉండవా? తినడం.. మీ కోరిక తీర్చుకుని అటు తిరిగి పడుకోవటం.. ఉదయం లేచి నాష్టా చేయడం... ఆఫీస్ కెళ్ళిపోవడం... ఇంతేనా" అంది ఖాతూన్... ఆమె గొంతులో కోపంకన్నా తనని మనిషిలా కాకుండా కోరిక తీర్చే రబ్బరు బొమ్మలా వాడుకుంటున్నాడన్న ఉక్రోషం...

"ఏముంటాయి మాట్లాడటానికి? రెండేళ్ళనుంచి పన్చేస్తున్న ఆఫీసే... కొత్తగా చెప్పడానికి విశేషాలేమీ లేవు"

"నేను మీ ఆఫీస్ గురించి అడగటం లేదు. మన మధ్య మాట్లాడుకోడానికి సంగతులే లేవా?"

"అదేదో నువ్వే మాట్లాడొచ్చుగా... నేను వింటాను" .

ఆమెకు బాగా కోపం రావడం వల్ల కొన్ని నిముషాలు మౌనంగా కోపాన్ని దిగమింగే ప్రయత్నం చేసింది. ఆ చీకటిలో విసుగుతోనో దుఃఖంతోనో ఆమె విడుస్తున్న నిట్టూర్పులు మాత్రం విన్పించాయి.

"నేనో విషయం అడుగుతాను... నిజం చెప్తారా?" అంది కొంత విరామం తర్వాత.

"నేనెప్పుడూ నీకు అబద్ధాలు చెప్పలేదు"

"నిజమే... కాని కొన్ని నిజాలు మాత్రం చెప్పకుండా దాచారు. పోనియ్యండి.

మన నిఖా ఐన ఈ రెండేళ్ళలో మీకు కోపం తెప్పించేలా ఎప్పుడైనా ప్రవర్తించానా?"

"లేదు"

"మీ ఇష్టాలకు అనుగుణంగానే నడుచుకున్నానా?"

"నీతో గడిపిన కాలం నాకు చాలా తృప్తినిచ్చింది."

"కానీ మనం భార్యాభర్తలుగా ఉండేది యింకో నెర్రోజులు మాత్రమే... దారుణం కదూ. నన్నిలా వదిలేసి వెళ్ళడం మీకు న్యాయంగా అన్పిస్తుందా?" ఆమె ఏడుపు సన్నగా విన్పిస్తోంది.

"యిందులో అన్యాయమేముంది? నిన్ను నీ తల్లిదండ్రుల అనుమతితో నిఖా చేసుకున్నాను. మన పెళ్ళికి ముందే నాకు హైద్రాబాద్‌లో భార్యా పిల్లలున్న విషయం మీ అబ్బాజాన్‌కి చెప్పాను. అభ్యంతరం లేకపోతేనే నిఖా చేయమన్నాను. నీకన్నీ తెలిసే పెళ్ళికి ఒప్పుకున్నావనుకున్నాను. మీ నాన్న నీకు చెప్పకుండా దాస్తే అందులో నా తప్పేం ఉంది?"

"సరే. మీ తప్పేమీ లేదు. మీకిది రెండో వివాహమని చెప్పకుండా దాచిన అబ్బాదీ తప్పు కాదు. పాపం ఆడపిల్ల పెళ్ళి చేయలేని అశక్తుడు. అంతకన్నా చాతకాని అసమర్థుడు. తప్పంతా నాదే. పేద ముస్లిం కడుపున ఆడపిల్లగా పుట్టడం" ఖాతూన్ సన్నగా ఏడుస్తోంది.

"నేనేదో అపరాధం చేసినట్లు మాట్లాడ్తావేంటి? మన ముస్లింలలో నలుగుర్ని నిఖా చేసుకునే వెసులుబాటు మగవాడికి కల్పించారుగా. నువ్వు నాకు రెండో భార్యవే. యింకా యిద్దర్ని చేసుకున్నా నన్నెవ్వరూ తప్పు పట్టరు" అంటూ నవ్వాడు. అతని నవ్వు తోడేలు నవ్వులా వికృతంగా ధ్వనించింది.

"తప్పు పట్టే అధికారాన్ని ఆడదానికి కల్పించకపోవడమేగా మీ జాతి మాకు చేసిన అన్యాయం.. పోనివ్వండి. దానికీ సమాధాన పడ్డాను. నా నసీబ్‌లో మీకు రెండో భార్యగా ఉండమని ఆ అల్లా రాశాడనుకున్నాను. కానీ మరో నెలలో మీ డెప్యుటేషన్ పూర్తికాగానే నాకు తలాక్ ఇస్తానంటున్నారే. అదే నాకు మింగుడు పడటం

# అంతర్గానం

ఎప్పటిలానే ఒక మృత సాయంకాలం...

రంగు వెలసి, పెచ్చులూడిపోయిన గోడమీది గడియారంలో సెకండ్ల ముల్లు శబ్దం చేస్తూ కదుల్తోంది. టిక్ టిక్ టిక్... శవాలు.. గుట్టలు గుట్టలుగా శవాలు.. నిముషానికొకటి చొప్పున.. రక్తమోడుతున్న నిముషాలు.. కళ్ళముందే ప్రాణాలు విడుస్తున్న కాలం.. మళ్ళా వెంటవెంటనే చీమల్లా పుట్టుకొస్తూ... గదినిండా గతించిన నిముషాల శవాలు... భయపెడ్తూ.. బాధపెడ్తూ...

గాలి బంధించినట్లు... వూపిరాడ్డం లేదు... ఉక్కపోత.. పెళ్ళయిన కొత్తలో నాటిన పెరట్లోని జామ చెట్టు సిమెంటు పూత పూసినట్టు కదలటం లేదు. చుట్టూ చలనం లేని వాటి మధ్య ... నిశ్చలంగా నేను...

కామాక్షి ఏదో అంటోంది... పెదవులు కదుల్తున్నాయి. చేతులు బలంగా వూపుతూ.. కళ్ళల్లో క్రోధం.. ఒకప్పుడు నేను ఆరాధించి కవిత్వం రాసిన కళ్ళేనా? కామాక్షి కాదు రక్తాక్షి.. నోరు పెద్దగా తెరిచి అరుస్తోంది... చలిస్తోందా? చలనం హృదయంలో కదా ఉండాలి.. గుండె కొట్టుకోవడమే సజీవంగా ఉన్నదనడానికి సాక్ష్యమా? హృదయంలో తడితడిగా తరంగాల్లా లేచిపడే స్పందనలు కదా ముఖ్యం.. గుండె కాదు గుండ్రాయి.. యింకెక్కడి స్పందనా..

"మిమ్మల్నే.. నేను నోరు పారేసుకోవడం తప్ప కాస్తయినా పట్టించుకోరేం? పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయాలా... దానికపుడే పదిహేనేళ్ళు నిండాయి. ఏమైనా స్పృహలో ఉన్నారా? తాగి తైతక్కలాడ్తూ బజార్లెంట బలాదూర్‌గా తిరగటం కాదు. భర్తగా ఎప్పుడో ఫెయిలైనారు. కనీసం తండ్రిగా మీ బాధ్యతలు గుర్తున్నాయా అసలు? యిలా తిడ్తేగాని చలనం రాదా మీలో? అంతా నా ఖర్మ"

చలనమా? అన్నీ అచేతనాలేగా.. మాంత్రికురాలు హాంఫట్ అని మంత్రదండం తిప్పగానే అందరూ రాతిబొమ్మల్లా మారిపోయినట్లు... కుర్చీలో మొలిచిన అచలంలా నేను... చిన్నప్పుడు చదువుకున్న న్యూటన్ చలన సూత్రాలు... ఇనర్షియా.. జడత్వం..

స్థిరంగా ఒక చోట కదలకుండా ఉన్న వస్తువు ఎప్పటికీ స్థిరమే... బైటినుంచి ఫోర్స్ అంటే బలమైనదేదో తాకనంత వరకు...

శరీరం కదుల్తూనే ఉంది. రోజూ ఆఫీస్ అనే జీతమిచ్చే జైలుకెళ్ళి ఎనిమిదో పదో గంటలు కారాగారవాసం చేస్తున్నాగా.. మళ్ళా ఇల్లనబడే మూడు గదుల జైలుకొస్తున్నాగా... ఎటొచ్చీ మనసే మైదాపిండి ముద్దలా... కదలని మొద్దులా.. స్తబ్దత.. జడత్వం... బాహ్యంగా ఎవరైనా బలాన్ని ప్రయోగిస్తే తప్ప.. సుతిమెత్తటి బలాన్ని.. సున్నితంగా... సుకుమారంగా... అన్నిటికీ మించి ప్రేమగా.. లాలనగా.. ఎవరున్నారలా? ఎక్కడున్నారు? వెతికీ వెతికి... విసిగి వేసారి.. ప్లీజ్ నన్నోసారి కదిలించరూ... ఈ జడత్వం నుంచి... ఈ స్తబ్దత నుంచి విముక్తి ప్రసాదించరూ...

పెళ్ళయిన కొత్తలో బాగానే ఉండింది. యిద్దరు పిల్లలు... అమ్మాయి అబ్బాయి... అమ్మాయి పదో తరగతిలో ఉంది... అబ్బాయి ఎనిమిది...

మూడు నాలుగేళ్ళనుంచి ఏదో మార్పు... ఒకే యింట్లో ఉంటున్నా నలుగురం నాలుగు దుర్గాలుగా విడిపోయినట్లు... కాదు. రెండు దుర్గాలే. ఒక దుర్గంలో వాళ్ళు ముగ్గురూ ఒక జట్టుగా.. నేనొక్కడినే ఒంటరిగా... యిల్లు వాళ్ళదైనట్లు, ఆ యింట్లో నేనో అనుకోని అవసరంలేని అతిథిలా...

పరాయితనం.. నా భార్యాపిల్లలకు నేను పరాయి... వెలి వేసిన వ్యక్తిలా.. వాళ్ళ ప్రపంచంలో వాళ్ళుంటారు.. నా గురించే ఎవ్వరూ పట్టించుకోరు. ఆఫీస్ పనితో అలసిపోయి యింటికొస్తే 'అయ్యో.. మొహం అలా వాడిపోయిందేం? కొద్దిగా చన్నీళ్ళతో కడుక్కుని రండి. వేడివేడిగా కాఫీ కలిపిస్తాను' అని కామాక్షి అంటుందేమోనని ఎన్ని మార్లు ఎదురుచూశానో... అనదు.. అలా అంటే ఎంత బావుంటుందో కదా..

మంచంపైనా అంతే...పక్కపక్కనే ఉంటూ విచ్చు కత్తుల్తో కదిలే రెండు శత్రుదేశాల్లా... ఉత్తర దక్షిణ ధృవాలు పొరపాటున ఒకే గదిలో బంధించబడినట్లు... తను ఉత్తర ధృవంలో విరిసిన అరోరా బొరియాలిస్.. నేను దక్షిణ ధృవతీరాన నిలిచిన పెలికాన్ పక్షిని. తను ఆనంద సందోహాల మధ్య అక్కడెక్కడో నక్షత్ర ధూళిని తొక్కుకుంటూ... నేను కలల బూడిద రాశులమీద కన్నీళ్ళు చల్లుతూ... తిలక్ అమృతం

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Antarganam+Sri+Vijaya+Lakshmi+Publications**

* * *